# గలగలా గోదారి

-భైరవయ్య

"హ్రీంకాపాలీ, హ్రీం చండాలీ పలుకు. పలకవే పలుకు. ఎవరు నువ్వు. పలుకు. నీచేత పలికిస్తా. నిన్ను భూస్థాపితం చేస్తా. ఈ కాళయ్యంటే ఎవరను కుంటున్నావో" అంటూ రంకెలు వినిపిస్తే, మెళుకువొచ్చింది సుబ్బారాయుడిగారికి.

"ఏమిటే ఈ అర్ధరాత్రి అంకమ్మ శివాలు" అంటూ లేచి గుడ్డిదీపం పెద్దది చేసి, జేబుగడియారం చూసుకున్నారు. అప్పటికే మూడున్నర దాటింది.

పూర్ణమ్మగారు కూడా లేచారు.

"చిట్టెమ్మ కోడలండి.. పెళ్ళయి పదేళ్ళయిందిగా. ఇంతవరకు పిల్లా పీచూ లేరాయె. ఏడాదిపైగా, ఆ అమ్మాయి తీరు కూడా బాగా లేదు. కొంచెం పిచ్చి ధోరణిలో పడింది. ఎవర్తో సోది చెప్పేది, రోడ్డుమీద పోతూ, గుమ్మంలో నిలబడ్డ ఆ పిల్లని చూసి, దెయ్యం పట్టింట్లో పారాడుతోంటే తెలుసుకోలేదా" అందిట. పక్కనే అరుగు మీద కూచున్న చిట్టెమ్మతో ఆవిడ అదురుకుని కాళయ్యదగ్గరకెళ్ళిందిట. వాడొచ్చి," నిజమే ఇది మామూలుగా పోంగేది కాదు. దీని భరతం నేనే పట్టాలి" అన్నాడుట. రాత్రి పదకొండు గంటల నుంచి, రామలింగేశ్వరుడి గుళ్ళో నూతి చప్టామీద జరుగుతోందీ భాగోతం" అందావిడ.

"......బాబోయ్ .నన్ను కొట్టకు. నన్ను కొట్టొద్దని చెప్పండత్తయ్యా" అని అరుపులు వినిపించాయిలోపున.

"దాన్ని కొట్టి చంపేస్తారేమిటే. ఆ చిట్టెమ్మకి మరీ బుద్ధీ జ్ఞానం లేకుండా పోతోంది" అన్నారు సుబ్బారాయుడుగారు.

"అదోకొయ్య. దానికెవరు చెప్తారండీ" అంది పూర్ణమ్మగారు.

"అమ్మోవ్. నన్ను చంపేస్తున్నారేవ్. బాబూ నీ కాళ్ళు పట్టుకుంటా. నన్ను కొట్టకు. ఏవండీ.. మీరన్నా చెప్పండీ" అని చిట్టెమ్మ కోడలి గొంతు....

"ఈ కాళయ్య దగ్గర వేషాలేస్తున్నావే. నువ్వు మామూలుగా పోంగే ఘటానివి కావు. నీ తాటవొలి చేస్తాను. కాసుకో. చండభైరవిని వదుల్తున్నాను. భం భం భైరవీ తాడయ తాడయ" అన్న గావు కేకలు, గాలిని చీలుస్తున్న చింత బెత్తం చప్పుడు వినిపించాయి.

"ఆ చిట్టెమ్మ ముండ, ఈ కాళయ్య పీనుగ తెల్లారేలోగా ఆ పిల్లని చంపేస్తారే. ఆ మొగుడుగాడిద మేదకుడయిపోవడంతో ఆ పిల్ల బతుకిలా తగలడింది." అన్నారు సుబ్బారాయుడుగారు.

"మరే. వాడు మేదకుడు కాకపోతే ఈ పాటికా పిల్ల కడుపు పండకుండా వుండేదా. ఏమిటో ప్రారబ్ధం" అంటూ పూర్ణమ్మ గారు నిట్టూర్చారు.

భోళ్ళుమన్న చప్పుడు.

"చచ్చానో దేవుడో" అన్నకేక.

సుబ్బారాయుడుగారుండబట్టలేకపోయారు.

"నే వెళ్ళి చూసొస్తానుండు. నిష్కారణంగా ఆ పిల్లని చంపేశేలా వున్నారు. ఈ కాళయ్యెక్కడ దాపురించాడే ఈ ఊరికి". ఏమో జులాయి పీనుగ. చిన్నప్పుడెంత ఆకతాయిగా వుండేవాడో. జామిచెట్టు మీద పిందెని బతకనిచ్చేవాడుకాదు. కొన్నాళ్ళు కనిపించకపోతే పీడ విరగడయిందనుకున్నాను. మళ్ళీ ఊడిపడ్డాడు. చూస్తే రోత పుట్టేలా రూపమూ వీడూను.

రామలింగేశ్వరుడి గుళ్ళోంచి చప్పుళ్ళు...అరుపులు ...ఆపిల్ల ఏడుపు...

"ఆ చిట్టెమ్మకి గడ్డెట్టి, ఆ కాళయ్యగాడ్ని రెండు

## దెయ్యం వదిలింది


వాయించొస్తానుండు" అని కదిలారు సుబ్బారాయుడు గారు.

"మీకెందుకండీ గొడవ. ఆ చిట్టెమ్మ నోరసలే మంచిది కాదు. ఆ కాళయ్యగాడు మంత్రాలమారి వెధవ. ఏ విద్యలు నేర్చుకున్నాడో ఏమో".

"వాడిమొహం. బడితె పూజకి అన్ని శక్తులూ లొంగుతాయి. ఉపేక్షిస్తే ఆ పిల్ల శవాన్ని చూడాలి మనం తెల్లారితే." అంటూ తలుపు తీసుకుని రామలింగేశ్వరుడి గుడికేసి నడిచారాయన.

చిట్టెమ్మ మొగుడు, ఆవిడ కాపరానికొచ్చిన రెండేళ్ళకే పటమెక్కేశాడురా అబ్బాయ్. బతికున్నప్పుడు కమ్మట పలుక్కి నోచుకోకపోయినా, పటమెక్కాక మటుకు గంధప్పొట్టుతో చేసిన మాల వేయించుకున్నాడ్రా. పోయే ముందు, ఆ చిట్టెమ్మకో కొడుకుని ప్రసాదించాడులే. అరెకరం స్థలంలో కట్టిన మండువాయిల్లు, ఇరవై ఎకరాల భూమి చిట్టెమ్మ పరం చేసి మరీ పోయాడు. ఆవూరు పల్లెటూరు కాకపోగా; సర్కారువారి ఆఫీసులు, సబ్‌కోర్టు అవీ వున్నవూరాయె. అందువల్ల, ఆ మండువా ఇల్లు వాటాలు చేసి అద్దెలక్కూడా యిచ్చిందావిడ. ఆ పేటలో, ఆవిడనోటికి జడవనివారు లేరనుకో. తాటి చెట్టంత మగాడైనా సరే తరిగేసెయ్యగలదు. ఆ పుట్టిన కొడుకు, ఆవిడ కొంగు చాటునే మూర్తీభవించడం వల్లో లేక ఆ ఇంటి మగతనమంతా ఆవిడలోనే మూర్తీభవించడం వల్లో ఆడారి వాడుగానే తయారయ్యాడు. ఆవిడ ప్రతిభ, ఆకొడుకు ఘనత తెలిసి చుట్టుపక్కల వూళ్ళవారెవరూ పిల్లనివ్వక పోతే; వశిష్ట గోదావరి దాటి, రాజోలు తాలూకా నుంచి పిల్లని తెచ్చి, నర్సాపురం సత్రంలో పెళ్ళి జరిపించేసిందిరా ఆ మహాతల్లి. కాపరానికని అడుగు పెట్టిన కోడలు పిల్ల. మళ్ళీ పుట్టింటఅడుగు పెట్టలేదురా అబ్బాయ్. కాపరాని కొచ్చిన రెండేళ్ళనుంచీ ఆ కోడలు మీద సణుగుతూనే వుంది "పిల్లలు పుట్టలేదని" కొడుకు విషయంలో అనుమానముండడంతో, సణగటం వరకే పరిమితం చేసుకుందిరా ఆ మహాతల్లి. రోజులుగడుస్తున్న కొద్దీ కోడలిలో కూడా ఏదో దోషం వుందేమోనన్న అనుమానమూ లోపల దొలవడం ప్రారంభించిందిరా. ఆ పిల్ల ప్రవర్తన కూడా అనుమానాన్ని బలపరచ సాగిందిలే.

ఆ కోడలు పిల్ల, పాపం, మొదట్లో బాగానే వుండేదిరా అబ్బాయ్. అయినింటిపిల్ల. ఒద్దికలో వుండడం, వున్నదాంతోనే సర్దుకుపోవడం అలవాటయిన పిల్ల. పైగా చదువుకున్నది కూడా కాదాయె. అందువల్లే, ఆ చిట్టెమ్మ పుణ్యం పుచ్చింది. లేకపోతే రోడ్డున పడేదే. అయినా వయసు తిరగబడుతూ వుంటుంది కదరా. అణుస్తున్న కొద్దీ అది శరీరాన్నీ; మెదడునీ వేడెక్కిస్తూ వుంటుంది. ఆ పిల్ల పిచ్చి ధోరణికదేరా కారణం. పిచ్చి ధోరణంటే మరేం లేదురా అబ్బాయ్. మన్ను తిన్న



పాములా పడివుంటుంది. మనిషిలో చలనం వున్నట్టు కనిపించదు. ఎవరేదడిగినా సమాధానం చెప్పదు. "ఇహి" అని వెర్రిగా నవ్వేసి వెళిపోతుంది. నూతి దగ్గర నిలబడి, తోడి పోసుకున్న నీళ్ళు తోడిపోసుకుంటూనే వుంటుంది. అంతేరా అబ్బాయ్.

సోదెకత్తె, పోతూ వున్నది పోక, పనిమాలి ఆగి ఆ మాట చెప్పడంతో, చిట్టెమ్మ అనుమానం గట్టిపడి పోయిందిరా. వెంటనే కాళయ్య దగ్గరకి పరిగెట్టింది.

కాళయ్య ఆ వూరి వాడేలే. చిన్నప్పటినుంచీ అల్లరి చిల్లరగా తిరిగేవాడు. వాడి వీపు మీద చెక్కపేళ్ళు విరిచీ విరిచీ, ఆ తండ్రి చేతులు పడిపోయాయి గానీ, వాడి బుద్ధి మారలేదురా. వున్నట్టుండి వాడు మాయమై పోయాడు. పదేళ్ళ వయసులో వూరు వదిలి పెట్టిన వాడు, పాతికేళ్ళ వయసుకి తిరిగి వచ్చాడు. వచ్చినవాడు చిన్నప్పటి కాళయ్యలా లెడు. తలంతా జటలు కట్టి వుంది. ఆ జటలు మొకాళ్ళ దాకా వేళాడుతున్నాయి. మొక్కజొన్న కండెల్లా అటూ యిటూ మీసాలు. నుదురంతా కప్పేస్తూ ఎర్రగా నుదురమ్మట నెత్తురోడు తోందా అన్నట్టు కుంకుమ బొట్టు, అదాటుగా చూస్తే, అవిటె గుండెలాగి పోయేట్టుగా వున్నాడావాడు. చీటికీ మాటికీ 'జైమహాకాళీ' అనేవాడా. దాంతో అందరూ వాడి చిన్నప్పటి పేరు మర్చిపోయి, 'కాళయ్య' అనే పేరు శాశ్వతం చేశేసారు.

"ఏం చేశావురా" ఎక్కడికెళ్ళావురా అని అడిగిన వాళ్ళకి 'నేను కలకత్తా వెళ్ళాను. అక్కడ ఓ మహానుభావుడి దగర కాళీ ఉపాసన నేర్చుకున్నాను. ఆయనకి ఆరు వందల సంవత్సరాల వయసు. నేను కన్నెర్ర జేస్తే ఎటువంటి శక్తైనా గడగడలాడాల్సిందే. ఆ..." అన్నాడు. నమ్మేవాళ్ళు నమ్మేర్రా అబ్బాయ్. విషయం లోతులు తెలిసిన వాళ్ళు, "ఎవడి పిచ్చి వాడికానందం" అని వూరుకున్నారు.

ఆ కాళయ్య దగ్గరకా చిట్టెమ్మ వెళ్ళిందిరా. వాడొచ్చి కోడలు పిల్లని చూసి, 'ఇది భయంకర కామినీ పిశాచి. ఇది ఓ పట్టాన లొంగదు. రాత్రి పదకొండు గంటలకి శివాలయంలో దాని భరతం పడతాను. నూరు నిమ్మ కాయలు, రెండు వీశెల గుగ్గిలం, పసుపు కుంకుమ సిద్ధంగా వుంచు. నేనిప్పుడే వెళ్ళి పూజలో కూచుంటాను" అన్నాడా అబ్బాయ్.

ఆ విధంగా రాత్రి పదకొండు గంటలకి రంగం సిద్ధ మయిరది.

సుబ్బారాయుడు గారు అడుగు పెట్టేసరికి, రంగం చాలా భీభత్సంగా వుందిరా అబ్బాయ్. ఆ ప్రాంతమంతా సాంబ్రాణీ ధూపంతో వూపిరాడకుండా వుంది.

కాళయ్య నల్లటి పంచె కట్టుకుని, ఒక చేత వేపమండ మరోచేత చింతబరికె పట్టుకుని, గంతులేస్తూ అరుస్తున్నాడు. ఆవేశంగా మంత్రాలు చదువుతున్నాడు. చిట్టెమ్మ కుంపట్లో బొగ్గులారకుండా విసుర్తూ, సాంబ్రాణిధూపం వేస్తూ, "అమ్మతల్లోయ్. నాబిడ్డ నొదిలేసి పోవేవ్' అని దణ్ణాలు పెడుతోంది. కొడుకు దూరంగా కూచున్నాడు నిర్విచారంగా. కోడలు జుట్టు విరబోసుకుని వుంది. నెత్తిమీంచి, నిమ్మరసం నీళ్ళు కలిసి కిందికి పారుతున్నాయి. మొహమంతా పసుపు పుయ్యబడి వుంది. ఒంటి మీద చీర తప్ప మరో ఆచ్ఛాదన లేదు. అదంతా తడిసి ఒంటికి అతుక్కుపోయింది. ఒళ్ళంతా తట్లు తేలివుంది. అక్కడక్కడ చర్మం చిట్లి కూడా వుందిరా. ఆ అమ్మాయి, ఒంటి మీద పడే దెబ్బల నుంచి కాక, ఒళ్ళు దాచుకోడానికి విశ్వప్రయత్నం చేస్తోందిరా. ఎంత ప్రయత్నం చేస్తున్నా తడిసిపోయిన చీర జాకెట్టు లేని ఒంటిని దాచలేక పోతోందిరా అబ్బాయ్. దానికి తోడు కాళయ్యగాడి చేతిలో ఛెళ్ళుమంటున్న చింత బరికె. చుట్టూ కొద్దిగా జనం కూడా వున్నార్రా.

ఆ బీభత్సం చూసేసరికి సుబ్బారాయుడిగారికి పిచ్చి కోపం వచ్చిందిరా.

"ఒరే కాళయ్యా. ఆగరా పింజారీ వెధవా' అని కేక పెట్టార్రా.

ఈలోపునారే అబ్బాయ్, కాళయ్య విసిరిన చింత బరికెని తప్పించుకోవడంలో పైట జారిన కోడలు పిల్ల, బయటపడ్డ ఒంటిని పట్టించుకోకుండా, కాళయ్యగాడి మీదికోదూకు దూకిందిరా. పొడుగాటి వాడి జటలు పట్టుకుని, ఒక్కగుంజు గుంజిందిరా. ఆ దెబ్బకు బోర్లా పడ్డవాడి మీద: ఒక్క అంగలో చిట్టెమ్మ మీదికి దూకి, దాన్ని పక్కకి తోసి, ఆకుంపటెత్తి, మండుతున్న బొగ్గులు వాడి మీద గుమ్మరించిందిరా. వాడి చేతనున్న చింత బరికె వూడలాక్కుని, "బాబోయ్ దెయ్యం తిరగబడింది" అని పరిగెడుతున్న చిట్టెమ్మ వెనక పడిందిరా.

ఆ కొడుకు, "భలే భలే' అని చప్పట్లు కొట్టాడురా. అంతేరా అబ్బాయ్. అంతే. ●

సత్కాలక్షేపానికి శ్రీ శ్రీనివాసా వారి నవలలు
రిలీజయ్యాయి - చదివారా?
వనిత మాసపత్రిక
పాఠకులను
ఉర్రూతలూగించిన
"ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి
సీరియల్ నవల
స్వయంసిద్ధ
రూ 25/-
ఆంధ్ర పాఠకుల
అభిమాన రచయిత్రి
"ఆర్. సంధ్యాదేవి"
డైరెక్ట్ నవల
కీర్తిప్రియ - రూ 20/-
తెలుగు పాఠకుల
అభిమాన రచయిత
"గిరిజశ్రీ భగవాన్"
న్యూవేవ్
సస్పెన్స థ్రిల్లర్
జ్వాలావ్యూహం
రూ 20/-
విజయ మాసపత్రికలో
సీరియల్‌గా వెలువడిన
"కొమ్మూరి సాంబశివరావు"
సస్పెన్స థ్రిల్లర్
అర్ధరాత్రి పిలుపు
రూ 25/-
శ్రీ శ్రీనివాస పబ్లిషింగ్ హౌస్
అగ్రహారం, గుంటూరు-522004

తెలుగు నవలా ప్రపంచంలో
నూతన అధ్యాయం!
క్రియేటివ్ వారి ప్రారంభ విడుదలలు
1-8-85 న విడుదలయ్యాయి!
గిరిజశ్రీ భగవాన్
'పండుగొస్తుంది పారాహుషార్' రూ. 18/-
యర్లగడ్డ సరోజినీదేవి
పున్నమి వెన్నెల ______ రూ. 20/-
లలితా ఆరుద్ర
అగ్ని పంజరం ______ రూ. 15/-
కొండముది శ్రీరామచంద్రమూర్తి
తలుపులు తెరవకండి ______ రూ. 16/-
ఆర్డరుతో నేడే అడ్వాన్సు పంపండి!
క్రియేటివ్ పబ్లిషర్స్
నెం. 14, సౌత్ ఉస్మాన్ రోడ్, టి. నగర్
మద్రాస్-600 017